# వ్యాపారం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

**సూరిబాబుకి నవ్వొచ్చింది అప్పారావు మాటలకి. నిజమే సన్నకారు రైతులకీ, వ్యాపారస్తులకీ బేంకీలు అప్పులిస్తాయి. కానీ దానికి ఎంతో చేతిది పెట్టుకోవాలి. ఏదో సామెజ్జెప్పినట్టు అయునేవుంటే గుండెందుకూ?**

గుమ్మందిగి రోడ్డుమీదికి నడిచేడు సూరిబాబు. ఒకవైపు కాళ్ళు నడవనని మొరాయిస్తున్నా మరోవైపు ఆశ ముందుకుతోస్తోంది.

నాలుగురోజులైయే సంపాదనాలేదు- నాలుగింజలు ఎక్కడో అడిగితెచ్చి అలివేలు వుడకేస్తే తినడం, ఎక్కడెక్కడో తిరిగి యేరాత్రో యిల్లుజేరడం....

ఈ రోజు కొత్త బొమ్మ రిలీజైంది. ఎలా లేదన్నా మరో యిరవై రోజులవరకూ తన వ్యాపారం నిరాటంకంగా సాగిపోతుంది. తన అదృష్టం, గురుడిదశ బావుందంటే బొమ్మ హిట్టయిపోయి కూచుంటుంది. తనకు రెండు నెలలపాటు తిండికి ధోకా వుండదు.

'ఈ బొమ్మలో గురుడిది సూపరేక్షనే. ఏటనుకున్నావో. హిట్టాహిట్టున్నరా! వరసాగ్గ నాలుగుషోలు చూసేస్తారీ కాలేజీ కుర్రోళ్ళు. మదుపెట్టాలేగాని తిరుగుండదు. బాల్కనీ టిక్కెట్టు పాతికవరకూపోతాది' అంటూ ఆశ చూపించేడు అప్పారావు.

ఆ ఆశతోనే సింహాచలంకాడ్లో పది రూపాయలు బదులు తీసుకున్నాడు. మార్నింగ్ షో. మేట్నీ అయ్యేక చూసుకుంటే పదికి పదీ మిగిలేయి.

'బాకీ పదీ నాకాడుంచు. ఆశకంతేటి? రోజులు బాగుండకపోతే యే పోలీసోడి పాలో అవుద్దంతా! అవి, బయల్దేరే ముందు పదిరూపాయలు తీసేసుకుంది అలివేలు. అలివేలు మాట కాదన్లేడు సూరిబాబు. అమ్మా, అయ్యా పోయాక తోడబుట్టిన అలివేలే ఆ యింటి అదృష్ట దేవత అనుకున్నాడు. అలివేలు అందర్లాటి ఆడపిల్ల కాదు. తెలివైనదీ, ఇంటిగుట్టు బయటపడకుండా తమ బతుకుల్లోని గతుకుల్ని సరిచేసుకునే గడుసుదనం గలదీనూ.

సరిగ్గా వెంకటప్పయ్య టీ బడ్డీ ముందు కొచ్చేసరికి సూరిబాబు కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి.

'ఈ భూపెపంచకంమీద యాపారం కాందేదీ లేదురా అబ్బీ. పెద్ద, చిన్న.... అంతేతేడా! అన్నీ యాపారాలే. పిసిండ్రీలమ్మే దగ్గర్నించి సినేమాలు తీసేదాకా అంతా యాపారమే. అందాక ఎందుకూ? యీ బతుకే ఒక యాపారం. పెట్టుబడెట్టి తినకపోనామా బండి నడదు. బండినడకపోతే బతుకుండదు. బలుపాకుతో తిండానికేనా మెతుకుండదు" ఎప్పుడో అప్పారావన్న మాటలు గుర్తొచ్చేయి.

అంచేత టీ బడ్డీలోకి నడిచి ఓ స్టాఁరింగ్ టీ తాగి, ఓ బీడీ అంటించి బయటపడ్డాడు సూరిబాబు.

ఇప్పుడు సూరిబాబు కాళ్ళు నడవనని మొరాయించడంలేదు. ఉత్సాహంగా వురకలేస్తున్నాయి.

* * *

ముసలి గుర్రంలాంటి పాతమోటర్ సైకిల్ని బయటపెట్టేడు బంగార్రాజు. ఆయనగారి సతీమణి సుభద్రా కుమారి వురఫ్ సుధారాణి. డ్రెస్సింగ్ టేబిల్ ముందు నిల్చుని యింకా యేయే సీసాల్లోని ద్రవాల్ని పూసుకోవాలో ఆలోచిస్తోంది. బంగార్రాజు మాత్రం డ్రాయింగ్ రూం సోఫాలో కూర్చొని సన్నగా రివటలా వున్న పనిపిల్లవంక ఆబగా చూస్తున్నాడు. మధ్యమధ్య వాచీ చూసుకుంటున్నాడు. పనిపిల్ల గది వూడ్చేక యిక కాలం గడవక లోపలికి కేకపెట్టేడు.

'వచ్చే వచ్చే' అంది సుధారాణి అద్దం ముందునించే అలా అన్నాక పెదాలకు రంగు పూసుకోడం మొదలుపెట్టింది. ఈలోగా బంగార్రాజు బీరువాలోని డైరీతీసి ఏవో ఎడ్రసులు చూసి, దాన్ని మోటర్ సైకిల్కున్న బాక్సులో భద్రపరచి వచ్చేడు. అప్పటికి సుధారాణి నుదుట తిలకం అమరింది. అన్ని అలంకరణలూ పూర్తయినా ఆమెకు సంతృప్తి కలగలేదు. వెధవది. ఎన్ని చిట్కాలుచేసిచూసినా ఒళ్ళు తగ్గటంలేదు. అదీ ఆమె అసంతృప్తికి కారణం.

ఐరావతంలా కదిలివచ్చే భార్యను చూసి నిట్టూర్చేడు బంగార్రాజు. ఎన్నో పనులు నెత్తిమీదున్నా అన్నిట్నీ అవతలపెట్టి భార్య వెనుక బయల్దేరక తప్పలేదు.

అంతఃపురంలోంచి బయటకొచ్చిన రాణీగారు తానెక్కాల్సిన పంచకల్యాణి గుర్రంస్థానే ఒకగాడిద వుండటంచూసి నిట్టూర్చినట్టు నిట్టూర్చింది సుధారాణి. ఆ ముసలి గుర్రంలాంటి మోటర్ సైకిల్నుచూసి-ఈ విషయంలో భర్తరాజు కంటె మొండివాడు. కొనగలిగిన స్తోమత వుండే తను మనసు పడినందుకైనా కొత్త స్కూటర్ కొనటంలేదు. ఆ విషయంలో ఆవిడ కోరిక కోరికగానే మిగిలిపోతోంది.

ఐదు నిముషాలు ఆపసోపాలుపడి కదిలింది బండి. బానపొట్టరాజుగారు, దిబ్బరాణీగారూ ముసలి గుర్రంమీద ప్రయాణంచేస్తుంటేచూడ్డం ఆ వాడలోని వాళ్ళకి ఎప్పటికీ వింతే!

* * *

ఒక్కసారి తను ఆరు జిల్లాలకు అందగాడైపోయినట్లూ, అప్పుడే విడుదలైన సినీమాకి హీరో అయిపోయినట్టూ ఆనందపడిపోయాడు సూరిబాబు. కౌంటర్ తెరిచాక యిచ్చిన మొదటి రెండు బాల్కనీ టిక్కెట్లూ తనవే. ఆ టిక్కెట్లు చేతిలో రెపరెపలాడుతూంటే లాటరీలో లక్షలొచ్చినంత సంబరపడిపోయాడు. ఆ వెంటనే జేబులో మిగిలిన చిల్లర పైసల్ని చూసి చిరాకుపడిపోయాడు. పేదవాడి చిరాకు పెదవికేచేటనుకుని అదీ విరమించుకున్నాడు. అయినా ఎవరిమీద చిరాకు పడగలడు?

అయిదో క్లాసు చదువుతూంటే అయ్యా, ఎనిమిదో క్లాసులో అమ్మాపోయి చదువక్కడితో ఆగిపోడానికి కారకులైతే సైకిల్షాపులో పది రూపాయల జీతానికి పన్లోజేరేడు. పని పెంచినా జీతం పెంచలేదని మానుకున్నాడు. ఆ తర్వాత అక్కడా అక్కడా చిన్నచిన్న పనులెన్నోచేశాడు. వయసు పెరిగింది. ఆలోచన్లూ పెరిగాయి. ధరలు పెరిగాయి. ఇంట్లో ఖర్చులు పెరిగాయి. కానీ పెరగనిది ఒక్క

ఆదాయిమే. ఒక రెండు మార్లు చచ్చిపోనాలని కూడ అనుకున్నాడు. కానీ తను చచ్చిపోతే అలివేలు వంటరిదై పోతుంది. అనాధయి పోతుంది. అనాధైన ఆడపిల్ల యీ దేశంలో పరువుగా సంతోషంగా బతకలేదని తనకు తెల్సు. అంచేత చావాలన్న కోరికనుకూడ మనసులోంచి తీసేశాడు.

సరిగ్గా ఆ సమయంలోనే పరిచయమయ్యేడు అప్పారావు. పొట్టిగా యిరవై యేళ్ళ కుర్రాడిలా కన్పించే అప్పారావుకి ముప్పయి అయిదేళ్ళంటే ఎవరూ నమ్మరు. అతని మాటలూ, చేతలూ లోకానుభవం విని తెల్సుకుంటే 'పండి పోయాడు' అనుకోక మానరు.

అప్పారావు తన ఆలోచనా సరళినీ, జీవిత విధానాన్నీ మార్చేసేడు. కష్టించిన వాడికే దేశంలో కూడు దొరకదన్నాడు - సుళువుగా డబ్బు సంపాదించే విధానాలను పది చెప్పేడు, 'చదువు, డబ్బు లేకగాని యీ చిట్కాలన్నిట్నీ కలిపి పుస్తకమేయిస్తే లక్షాధికారినై పోతాను అలాటి పుస్తకాలను కొనేవాళ్ళు మన దేశంలో చాలమంది వున్నారు' అన్నాడు-

ప్రభుత్వలాటరీల్లాగే అప్పారావు చిట్కాలు కూడ ఒక్కోప్పుడు పలుకుతూంటాయి, వచ్చిన్నాడు రోజుకి పాతికవరకూ వస్తుంది లేక పోయినా నష్టముండదు.

'ఏటొలే సూరిగా టీ తాగవేటి?' అంటూ వచ్చేడు అప్పారావు.

'టీ తాగేను. నువ్వుతాగు' అన్నాడు సూరిబాబు.

'అవునూ. ఎన్ని టిక్కెట్లు రెండా?'


అవునన్నట్లు తలూపేడు సూరిబాబు.

"ఏట్రా నీ బతుకు సల్లాగా. బొత్తిగా సన్నకారు యాపారస్తుడవై పోతన్నావ్. పోనీయే బేంక్ కాడో అప్పుదెచ్చుకో లేకపోయావా" అనేసి. బీడీ నోట్లోపెట్టుకుని టీ కొట్లోకి నడిచేడు.

సూరిబాబుకి నవ్వొచ్చింది అప్పారావు మాటలకి. నిజమే సన్నకారు రైతులకీ, వ్యాపారస్తులకీ బేంకీలు అప్పులిస్తాయి. కానీ దానికీ ఎంతో కొంత చేతిది పెట్టుకోవాలి. ఏదో సామెజెప్పినట్టు ఆయనేవుంటే బోడి గుండెందుకూ?

టిక్కెట్లిచ్చే కౌంటర్ ముందు క్యూ కొండ చిలువలా ఐదారు చుట్లు చుట్టుకుని నెమ్మదిగా నడుస్తోంది-అక్కడ అక్కడా ఒకరిద్దరు కాని స్టేబుల్సు లైన్లోలేని ఆడవాళ్ళమీద లాఠీ లెత్తుతున్నారు.

సినిమా స్టిల్స్ వున్నవైపు నడిచాడు సూరిబాబు - రంగు రంగుల ఫోటోలు ఎన్నెన్నో సన్నివేశాల్లో-



'గురుడు చాలా పోజుల్లో ఊగేడు' హీరోని మెచ్చుకుంటున్నా రెవరో. అవి చూస్తూ.

అక్కడి మాటలు వింటూంటే తనకి సినిమా చూడాలనిపించింది సూరిబాబుకి జేబులో టిక్కెట్లున్నాయి. చూడాలనే కోరికావుంది కానీ చూడకుండా చేసే పరిస్థితులే అడ్డు తగుతుల్తున్నాయి.

నిజానికి తను పరిస్థితుల మూలంగానే దిగజారిపోయాడు. వేశ్యలుచేసే వ్యాపారం కంటె తమ చేసే వ్యాపారం హీనమైనది. కానీ బ్రతుకు తెరువుకు మరో మార్గంలేదు - నీతి నిజాయితీలను నిరూపించుకునే అవకాశాలు రాలేదింత వరకూ.

హాలుముందున్న గట్టుమీద కూర్చొని బీడి అంటించేడు సూరిబాబు. వేశ్యలకీ, పోలీసులకీ చీకటి పడ్డాకనే వ్యాపారం మొదలైనట్టూ, స్టేటుగవర్నమెంటోళ్ళకి ఆఫీసయ్యాకనే గిరాకీ పెరిగినట్లూ, తమకీ బుకింగు మూసేకనే మొదలౌతుంది వ్యాపారం.

సూరిబాబు దృష్టి స్త్రీల కౌంటర్ వైపు పడింది. రోజుల పిల్లల్ని తీసుకొచ్చేది కొందరైతే నేడా రేపా అన్నట్లుండే ముసలమ్మలు కొందరు-అందరికీ సినిమా మోజే.

సూరిబాబుకి చటుక్కున అలివేలు గుర్తొచ్చింది కొత్తబొమ్మ- మొదటిరోజు మొదటాట అంటే ఎంత సంబరపడిపోతుంది! కానీ తమలాటోళ్ళకెలా కుదుర్తుంది? ఎప్పుడూ నూకల కరువే! కెరటాలు పోయేదెప్పుడు? సముద్రంలో స్నానం చేసేదెప్పుడు? తమ బతుకులే అలాగున్నాయి.

'ఈ మారెలాగైనా మొదటాట బాక్సు టిక్కెట్లు మీద చూపించాలి అలివేలికి' నిశ్చయించుకున్నాడు సూరిబాబు.

వెధవది ప్రాణమున్నంతవరకే యీ యావ. అంతవరకే యీ కోరికలూను, ఆ తర్వాత ఎంత సంపాదించొచ్చేవ్ అని యే యమధరమ రాజూ అడగడు.

మేట్నీ వదిలారు. మందల్లా జనం·

"అబ్బే- డబ్బుల్రావురా. క్లాసు పిక్చరు కోవలో కొచ్చేస్తాది" ఎవరో అంటున్నారు.

క్లాసు పిక్చరంటే డబ్బులొచ్చేసుకోదని అభిప్రాయం. అయినా మంచి నేర్చుకోడానికి క్లాసేటి మాబేటి అయితేఒక్కటిమాత్రంనిజం. విశార్పయిన క్లాసు బొమ్మయితే వింపాడిగా నడుస్తాది· ఇంటికాడ బయలేర్దిన గురుపు కొండెక్కాలంటే...కొండవరకూ నడుస్తూనే వుంటాడు-నడిచీ, నడిచీ, చూసేవాళ్ళకే కాళ్ళు నొప్పెట్టేట్టు- అదే మాబ్ అయితే గుమ్మంలోంచి కొండమీదకి ఒక్క జంపు చేస్తాడు గురుడు - పదారేళ్ళ పడుచుపిల్లని చంకలో ఏస్కుని మరీ! అదేనేమో తేడా.

'ఓర్నీ-ఆ టిక్కెట్లమ్ముతావా అనక కూరొండుకు తింటావురా లెగు లెగు-' అదిలించేడు అప్పారావు.

చేసే పనిలో ఉత్సాహం లేనట్టు యిబ్బందిగా కదిలేడు సూరిబాబు.

* * *

పెద్ద శబ్దంచేసి ఠక్కున ఆగింది బంగారాజు బండి సుధారాణి సీటుమీంచి బరువుగా జారి జారిపోతున్న పమిటను ఎగదోసుకుంటూ వయ్యారంగా నిలబడింది. రాజుగారు రథం దిగిన రాజావారిలా అక్కడున్న ఆటోమోబైల్ షాపు లోపలికి వెళ్ళి అక్కడాయనతో యేదో మాట్లాడేడు.

సరిగ్గా అదే సమయంలో ఆ అద్దాల షోకేస్ లోపల అందమైన కొత్త స్కూటర్ మీద విహరించే అందమైన జంట ఫోటో ఒకటి రాణీగారి దృష్టి నాకర్షించింది.

'ఎంత బాగుందాస్కూటరూ' అనుకుంది-

'రాకుమారుడిలా అతగాడూ బావున్నాడు' అనికూడ అనుకుంది - ఆ కుర్రాడి నడుం పట్టుకు కూర్చున్న చిరిపిరి జుత్తు పెళ్ళాం కంటే తనే విధంగా అంచనా వేసుకొని కొత్త లావు తప్ప ఏ విధంగానూ తీసిపోననుకుని సంబరపడింది - ఆ తర్వాత ఆ సంబరానికర్థం లేదని తెల్సుకుని, అటువంటి స్కూటర్ని కొనమని బంగార్రాజుని మనసులోనే తిట్టి పోసుకుంది. అసలు పెళ్ళికిముందే స్కూటరున్న వాడిని చేసుకోవాలనుకునేది సుధారాణి. స్కూటరుకన్నా మోటర్ సైకిలే మిన్న. కావలిస్తే ఆ తర్వాత అదీ కొనిపించుకో బంగారం లాంటి సంబంధం కాదనకని బంగార్రాజుకేసి కట్టబెట్టేడు తండ్రి.


ఎప్పట్నించో వున్న స్కూటర్ మోజు యిప్పటికీ తీరనేలేదు- పెళ్ళయిన ఆర్నెల్లకి కాబోలు...పట్టుబట్టి బంగార్రాజుచేతస్కూటర్ బుక్ చేయించింది-డిపోజిట్ అయిదొందిలూ తనిచ్చి ఆరువేలు పోతేపోయాయి అందమైన స్కూటర్ వస్తుందని ఆశపడింది. కానీ ఆ ఆశ, ఆనందంకూడ మూడు సినిమాలగానూ,

ఆరు బీచి షికార్లుగానే ముగిసిపోయాయి-

"నువ్వు స్కూటర్ బుక్ చేసిన వేళ ఎటువంటిదో చూశావా. పద్నాలుగు వేలొచ్చాయి" అన్నాడో రాత్రి బంగార్రాజు. రాణీగార్ని బాహువుల్లో బంధించడానికి ప్రయత్నిస్తూ.

మొదట అర్థంకాలేదు సుధారాణికి.

'ఆరువేల పెట్టుబడికి లాభం ఎనిమిది వేలన్నమాట. తెల్సిందా?" అంటూ బంగార్రాజు తెలియచెప్పేడు.






ఆపండి

బస్సు కొంత దూరం వెళ్ళింది.

"ఆపండి...."గట్టిగా అరిచాడు ప్రయాణీకుడు.

"ఏమయ్యా! నీ ఇష్టం వచ్చిన చోటల్లా ఆపడానికి నీ సొంత బండమనుకున్నావా?" కోపంగా అన్నాడు డ్రయివర్.

"కాదండి, కండెక్టరు ఎక్కలేదు" చెప్పాడతను.

—ఎమ్. వి. కృష్ణారావు (మంచిర్యాల్)

'అంటే బ్లేకులో'....ఆ మిగిలిన మాటను ఆవిడ నోట రానీయలేదు బంగార్రాజు.

'ఓ అందాల రాణీగారూ. దీపమున్నచోటే చీకటుంటుంది. వెలుగున్నచోటే నీడ వుంటుంది. పగలున్నరోజుకి రాత్రి వుంటుంది. అలాగే యిదీనూ. తప్పులేదు. ఇదీ ఓ వ్యాపారమే' అని నచ్చజెప్పేడు. గదిని చీకటిచేసి చీకటి రహస్యాన్ని విప్పేడు.

ఆ నాటినుంచే బంగార్రాజుకీ స్కూటర్ల మీద మోజు పెరిగింది 'పోనీ ..యిన్ని కొని అమ్మేరు. ఇంతలాభ మొచ్చింది. ఇప్పుడైనా మనమొకటి వుంచేసుకుందామండీ' అంది సుధారాణి ఓ రోజు. 'రాణీగారికి స్కూటరెందుకూ. ఏకంగా కారే కొందాం. అందాకా ఆగాలి' అంటూ సర్దిచెప్పేడు బంగార్రాజు.

అంతే! ఆ విషయాన్ని ఆ తర్వాత కదపలేదు సుధారాణి.

ఆటోమోబైల్ షాపులోంచి తిరిగొచ్చిన బంగార్రాజు రాణీగార్ని చూసి బంగారంలాంటి నవ్వోటి నవ్వేడు. దాని విలువ ఎనిమిదవేలు కావొచ్చు. పదివేలుకావొచ్చు.

ఆ ఆనందంలో పాలు పంచుకోడం యిష్టంలేక మూతిముడిచేసింది సుధారాణి.

* * *

సూరిబాబు యిబ్బందిగా అటూ యిటూ తిరుగుతున్నాడు. బుకింగు క్లోజయిపోయి అప్పుడే అరగంటయింది తనతోటి వాళ్ళంతా టిక్కెట్లను రెట్టింపు ధరలకు అమ్మేసుకున్నారు. అప్పారావు తన ఆరు టిక్కెట్లూ సునాయాసంగా అమ్మేసి, పాతిక రూపాయలూ

పట్టుకుపోయేడు.

సూరిబాబులో ఆతృత ఎక్కువైంది. అసలే దొంగచాటు వ్యాపారం. అటు హాలు మేనేజరూ, యిటు లాఠీల పోలీసులూ. వీళ్ళదృష్టిలో పడకుండా బేరం కుదుర్చుకోవాలి. ఆగిన ప్రతి రిక్షా దగ్గరకీ పరుగెత్తుతున్నాడు. 'బాల్కనీ టిక్కెట్లు రెండే వున్నాయి. కావాలా' అంటున్నాడు రహస్యంగా.

కొందరికి బేరం కుదరకా, కొందరికీ వ్యాపారం నచ్చక వెళ్ళిపోతున్నారు.

హాల్లో ట్రైలర్స్ మొదలు పెట్టేరు.

లాఠీల పోలీసులుకూడ హాల్లోకి చేరుతున్నారు.

హాలు చుట్టూ కారూ, రిక్షాలూ, ఆటోలూ, స్కూటరూ - పక్కలో బాంబు పేలినట్లయి వులిక్కిపడి చూశాడు సూరిబాబు. బంగార్రాజుగారు బండి ఆపి, బుకింగ్ వంకోమారు చూసి, చుట్టూ చూశారు. సుధారాణి చూపు అక్కడున్న స్కూటర్ల పైపుపడింది.

రంగు రంగులవి. పాతవీ...కొత్తవీ

"వాటిల్లో కొన్నయినా తన భర్త అమ్మినవి వుండొచ్చు" అనుకుంది.

"సార్. బాక్సు టిక్కెట్లు కావాలా"

ఆశగా అటువైపు చూశాడు బంగార్రాజు.

ఎదురుగా సూరిబాబు!

"ఎంత?"

చెప్పేడు సూరిబాబు.

"ఏమిటీ. రెట్టింపు ధరే. ఆశకైనా అంతుండాలిరా"

"గడవక చేసుకుంటున్న యాపారం బాబూ. తమలాంటోళ్ళకెంత" సూరిబాబులోని బింకం సడలిపోతోంది.

"గడవకపోతే కష్టపడి పన్జేసుకోవాలి. మాపీడానికి నాకంటె అమాయకులెవరూ కనబడలేదేంటి. టిక్కెట్టు మీద రూపాయి యిస్తాను. అంతే!" అన్నాడు చుట్టూచూస్తూ.

"మూడు గంటల్నించీ లైనుకాసి తీశాం సార్. మా కష్టానికి గిట్టదు" అంటూ వెళ్ళిపోబోయేడు సూరిబాబు.

"మార్కెట్లో పూలూ, పళ్ళూ వ్యాపారాల్లా మీరూ దిగిరాకపోతే ఎలా? కుళ్ళితే పెంటమీద పారబోస్తారుగాని చవగ్గా మాత్రం యివ్వరు వాళ్ళు. ధరపడిపోకూడదు మరి! అలాంటి కట్టు మీకూ వుందేమిటి" అని, ఆ మాటకూ సూరిబాబు దిగి రాకపోవడం చూసి!

"వెళ్ళిపోతావేం. ఇలా తే" అంటూ స్కూటర్‌కి స్టాండేసి వచ్చాడు బంగార్రాజు. దొంగలా చుట్టూచూసి మడతపెట్టిన టిక్కెట్లను బంగార్రాజు చేతికందించాడు సూరిబాబు.

సూరిబాబు కిప్పుడు ధైర్యంగా వుంది. జైల్లో వున్న ఆడపిల్లని కాపాడుకున్నట్లు కాపాడు కొచ్చాడు వాట్ని పోలీసుల కంట పడకుండా. టిక్కెట్లమీద మూడొచ్చినా చాలననుకున్నాడు.

దిబ్బరొట్టెలావున్న పర్సును జేబులోంచి తీసి నోట్లన్నీ లెక్కపెట్టాడు బంగార్రాజు. ఆ తర్వాత అన్ని అరలూ వెదికి అయిదు రూపాయల నోటుతీసి సూరిబాబు చేతిలో వుంచేడు.

'ఇదేటిబాబూ' అన్నాడు సూరిబాబు ఆశ్చర్యంగా.

'ఇస్తాన్రా. ఎక్కడికిపోను-యాభై నోటుంది నా దగ్గర-మిగిలిన చిల్లర తీసుకొచ్చి పట్టుకుపో' అంటూ హాలువైపు నడిచేడు.

'నాకెక్కడిది బాబూ అంతోట చిల్లరా. నా టిక్కెట్లు నాకిచ్చే' అంటూ వెంటపడ్డాడు సూరిబాబు.

"విజాయితీలేని బతుకుల్రా మీవి. అంచేతే కూడుండదు మీకు. ఈ టిక్కెట్ల డబ్బును నువ్వెప్పుడో ఆర్జించి వుంటావుగానీ వెళ్ళి చిల్లర తీసుకొచ్చి డబ్బు పట్టుకుపో-అల్లరి పెడితే అవీ దక్కవు. పోలీసులకప్పజెప్పేస్తానేమనుకున్నావో" గొంతు పెంచేడు బంగార్రాజు.

ఒకపక్క కట్టుకున్న భార్య-మరో పక్క సభ్య సమాజం.

బంగార్రాజు ధైర్యంగా ముందుకు నడిచేడు.

సూరిబాబు వెనక్కుతగ్గేడు. కాళ్ళు తడబడ్డాయి.

'బ్లేక్ మెయిలింగ్' అన్న పదానికి అర్థం తెలియకపోయినా అదంటే ఏంటో చాల సిన్మాల్లో చూశాడు. అటువంటిదే తన పట్ల యిపుడు జరిగిందనీ తెల్సుకున్నాడు.

గుండెల్లోంచి వుబికిన దుఃఖం కళ్ళల్లోంచి తన్నుకొచ్చింది సూరిబాబుకి.

తను చేస్తున్న వ్యాపారం తప్పే-కానీ యీ ఆకలీ పేదరికం ఎలా తీరేది? ఇలా గొప్పోడి దగ్గర బీదోడు తరతరాలుగా ఓడిపోతూనే వున్నాడు. మరి దీనికి అంతేదీ?

సూరిబాబు బుర్రలో ఎన్నెన్నో ఆలోచనలు!

హాల్లో తెరమీద బొమ్మలు కదుల్తున్నాయి.

తెరలు తెరలుగా చీకటి లోకం మీదకి జారుతోంది.

రోడ్డుమీద జనప్రవాహం కదిలిపోతూనే వుంది.

* * *

కలిమిలో పుట్టిన బంగార్రాజుగారి శ్రీమతికి కొత్త స్కూటర్ మోజు తీరలేదు.

లేమిలో పుట్టిన సూరిబాబు చెల్లెలికి మొదటాట సినిమా మోజు తీరలేదు.

కలిమిలేములనే ఒడ్లను ఒరుసుకుంటూ బ్లేకు వ్యాపారం సాగుతూనే వుంది. *

